సాక్షి ఆదిలాబాద్

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



నాగోబా స్మరణలో 'మెస్రం'

మర్రిచెట్టు వద్ద మెస్రం వంశీయుల పూజలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్ర నుంచి కూడా మెస్రం వంశీయులు తరలివచ్చి నాగోబాకు పూజలు చేస్తున్నారు. 8లో▸



రమాబాయికి ఘన నివాళి

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0/16.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చలి కొనసాగుతుంది. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

13న విద్యార్థులకు పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 13న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని కొలాం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు జిల్లాస్థాయి పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ ఓ ప్రకటనలో తెలిపారు. సుస్థిర భవిష్యత్ కోసం సైన్స్, ఉప అంశాలు, చెత్త, వ్యర్థాలు తగ్గించడం, ఆరోగ్యకరమైన అలవాట్లను దత్తత తీసుకోవడం, సుస్థిర ఆహార వ్యవస్థ దత్తత, ఒకసారి వాడి పారేసిన ప్లాస్టిక్‌కు నో చెప్పడం, నీటిని పొదుపు చేయడం, శక్తిని కాపాడటం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94400602888 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫ్యాక్టరీ తరలించాలి



ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోనికేంద్రలోని పిట్టలవాడలోగల పీవోపీ ఫ్యాక్టరీని వేరేచోటకు తరలించాలని కాలనీవాసులు బుధవారం ఆందోళన చేపట్టారు. దుమ్ము, దుర్గంధం కారణంగా ఊపిరితిత్తుల సమస్యలతో బాధ పడుతున్నామని తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1984లో ఆయిల్‌మిల్ కోసం ఈ స్థలాన్ని కేటాయించగా, సదరు వ్యక్తి పీవోపీ పరిశ్రమకు ఇచ్చారని పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అక్కడకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కాలనీవాసులు నారాయణ, మురళి, మాధవ్, లత, శ్రీకాంత్, చిరంజీవి, విజయ్, తోతరాం, మాధవ్, తాహెర తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లించండి

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్‌లో చేరిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో ప్రణీత, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12నుంచి మార్చి 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

జాతరలో దుకాణాల ఏర్పాటు



జాతరలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు

ఇంద్రవెల్లి: నాగోబా జాతర సమీపించడంతో ఆలయ ఆవరణలో వివిధ దుకాణాలు వెలుస్తున్నాయి. రంగుల రాట్నాలు, చిన్న పిల్లల సర్కస్‌లు, మోత్కా కువ్వ కూడా ఏర్పాటు చేస్తున్నారు. జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కేస్లాపూర్ గ్రామం ముఖద్వారం నుంచి నాగోబా ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. బందోబస్తు ఏర్పాట్లను బుధవారం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్ పర్యవేక్షించారు.

'రుణాలివ్వకుంటే సమావేశాలెందుకు'

కైలాస్‌నగర్: లక్ష్యం మేరకు రుణాలివ్వకుంటే సమావేశాలు ఎందుకని కలెక్టర్ రాహుల్‌రాజ్ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. బ్యాంకుల వారీగా రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతి తెలుసుకున్నారు. రుణాల పంపిణీలో వెనుకబడిన బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, యుకో, యాక్సిస్, సిటీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకర్లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్యానికి మించి రుణాలందించిన టీజీబీ ఆర్‌ఎం వెంకట్రామిరెడ్డిని సత్కరించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ అధికారిని అభినందించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని, పంటల సాగుకు, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహరుణాలతోపాటు ఇతర ప్రాధాన్యత రుణాలు అర్హులైన పేదలకు మంజూరు చేయాలన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద అర్హులకు యూనిట్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం 2024–25 పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఎల్‌డీఎం ప్రసాద్, నాబార్డ్ డీఎం ఎండీ రవూఫ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పద్మభూషణ్ రాజు, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, డీఏవో పుల్లయ్య తదితరులున్నారు.



జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం

ఉంటారా.. వెళ్తారా?

- డీడబ్ల్యూవోగా డీడీ స్థాయి అధికారి
- బాధ్యతలు స్వీకరించిన సబితా
- ఇతర జిల్లాలవారికి విడిదిగా పోస్టు
- ఇలా చేరి.. అలా వెళ్లిపోతున్న వైనం
- జిల్లాలో గాడి తప్పిన సంక్షేమం
- కొత్త అధికారి విధుల్లో కొనసాగేనా?



సబితాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

సాక్షి, ఆదిలాబాద్: నూతన జిల్లా సంక్షేమాధికారిగా సబితా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ డైరెక్టర్ హోదా కలిగిన ఈమె ఈ పోస్టులో కొనసాగుతారా? లేక.. గత ఆఫీసర్‌లాగే ఇలా చేరి.. అలా వెళ్లిపోతారా? అనే చర్చ ఆ శాఖలో జోరుగా సాగుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. గతేడాది మే 10వ తేదీన ఇదే హోదా కలిగిన సుభద్ర అనే అధికారి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నో రోజుల తర్వాత ఉన్నత హోదా కలిగిన రెగ్యులర్ అధికారి వచ్చారని అంతా భావించారు. తీరా.. మరుసటి రోజు నుంచే ఆమె సెలవు పెట్టి ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. మళ్లీ తిరిగి రాని ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లో పనిచేస్తున్నట్లు సమాచారం. మళ్లీ తొమ్మిది నెలల తర్వాత కొత్త అధికారి సబితా భద్రాద్రి కొత్తగూడెం నుంచి ఇక్కడికి వచ్చారు.

వెతుక్కోవాల్సిందే..

రాష్ట్రంలోని పాత 10 జిల్లాల ఐసీడీఎస్ కార్యాలయాల్లోనే డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) స్థాయి పోస్టులున్నాయి. వికలాంగుల సంక్షేమశాఖను విలీనం చేసిన తర్వాత ఆ శాఖలోని అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) పోస్టులు దీంట్లో కలిపారు. రాష్ట్రం మొత్తంగా అన్ని జిల్లాల్లో సంక్షేమాధికారి (డీడబ్ల్యూవో) పోస్టులు సృష్టించారు. కాగా, ఈ శాఖలో ఏడీ స్థాయి నుంచి డీడీగా పదోన్నతి పొందిన అధికారులు పాత 10 పోస్టుల్లో ఎక్కడైనా ఒకచోట కొలువుదీరాలి. దీంతో పదోన్నతి పొందినవారు ఆ పోస్టు ఉన్న కార్యాలయం వెతుక్కోవాల్సిందే.

ఇలాంటి పరిస్థితుల్లోనే గతేడాది సుభద్ర అనే అధికారి ఇక్కడ బాధ్యతలు స్వీకరించి ఒక్కరోజు మాత్రమే కొనసాగారు. మరుసటిరోజు నుంచి సెలవులో వెళ్లారు. ఇదే హోదా ఉన్న అధికారి సబితా తాజాగా బాధ్యతలు స్వీకరించారు. మరీ ఈ అధికారి జిల్లాలో కొనసాగుతారా? గత అధికారి లాగే సెలవులో వెళ్తారా? అనే చర్చ సాగుతోంది.

విడిదిగా మారిందా?

ఆదిలాబాద్‌లో డీడీ స్థాయి పోస్టు విడిదిగా మారిందా? అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ హోదా లభించిన అధికారులకు ఇతర జిల్లాల్లో ఈ పోస్టులున్నచోట ఖాళీ లేకపోవడం, ఆదిలాబాద్‌లో ఖాళీ ఉండడంతో తప్పని పరిస్థితుల్లో ఇక్కడికి వచ్చి చేరుతున్నారు. ఆ తర్వాత తాము అనుకున్న చోటికి వెళ్లిపోతున్నారు. ఇక్కడ దిగువ స్థాయి అధికారులు ఇన్‌చార్జి డీడబ్ల్యూవోగా కొనసాగుతున్నారు. మిల్కా నుంచి బుధవారం కొత్త అధికారి సబితా డీడబ్ల్యూవోగా బాధ్యతలు తీసుకున్నారు.

జిల్లాలో సంక్షేమం గాలికి..

జిల్లాలో రెగ్యులర్ ఉన్నతాధికారి లేకపోవడంతో సంక్షేమం గాడి తప్పిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా అంగన్‌వాడీల నిర్వహణ, నియామకాలు, అనుబంధ పౌష్టికాహార పంపిణీ జిల్లాలో సరైన రీతిలో జరగడం లేదన్న విమర్శలు ఏళ్లుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో డిప్యూటీ డైరెక్టర్ క్యాడర్ అధికారి బాధ్యతల్లో చేరారు. ఈ క్యాడర్ స్థాయి అధికారి పోస్టు ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉంది. మధ్యలో ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయినవారూ ఉన్నారు. ఈ నేపథ్యంలో సంక్షేమాన్ని గాడిలో పెట్టాల్సిన బాధ్యత కొత్త అధికారి ఉంది.

చేతివృత్తులకు చేయూత

- పీఎం విశ్వకర్మకు దరఖాస్తుల స్వీకరణ
- ఉచిత శిక్షణ, రూ.లక్ష సాయం పంపిణీ
- జిల్లాలో 20వేల మందికి ప్రయోజనం!



కైలాస్‌నగర్: చేతివృత్తులపై ఆధారపడి జీవించే వారిలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు ఆర్థిక చేయూతనందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఎంపికైన అభ్యర్థులకు వృత్తినైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రత్యేక డిజిటల్ గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. అలాగే జీవనోపాధి మెరుగుపర్చుకునేందుకు వీరికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ పథకం కింద జిల్లాలో 18 రకాల చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న 20వేల మందికి లబ్ధి చేకూరే అవకాశముంది.

దరఖాస్తు విధానం ఇలా..

ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే చేతివృత్తులవారు ఆధార్, రేషన్‌కార్డు కలిగి ఉండాలి. ఆధార్ కార్డుకు లింకైన మొబైల్ నంబర్, బ్యాంక్ ఖాతా పుస్తకం తదితర వివరాలతో కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసే సమయంలో ఓటీపీ, బయోమెట్రిక్ వివరాలు వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది.

ప్రత్యేక శిక్షణ ఇలా..

ఈ పథకం కింద ఎంపికైన అభ్యర్థులకు వృత్తినైపుణ్య డిజిటల్ గుర్తింపు కార్డుతో పాటు ధ్రువీకరణపత్రం అందజేస్తారు. ప్రాథమికంగా ఐదు రోజులు శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 చొప్పున చెల్లిస్తారు. అనంతరం 15రోజుల పాటు ప్రత్యేక వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఉపాధి కోసం అవసరమైన టూల్ కిట్ కింద రూ.15వేల ఆర్థికసాయం అందజేస్తారు. అనంతరం లబ్ధిదారులకు మొదటి విడతగా రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తారు. ఆ నగదును తిరిగి 18 నెలలో చెల్లించాల్సి ఉంటుంది. రెండో విడతలో రూ.2లక్షలను రుణంగా అందజేస్తారు. ఈ నగదును తిరిగి 36 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసాయం కోసం వృత్తినైపుణ్యం కలిగిన వారు 11,760 మంది దరఖాస్తు చేసుకున్నారు. కులాలతో సంబంధం లేకుండా ఆర్థికసాయం అందజేస్తుండటంతో సుమారు 20వేల మందికి లబ్ధి చేకూరే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



కులవృత్తులపై ఆధారపడి జీవించే వారికి ఆర్థిక సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని కింద ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తారు. అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పద్మభూషణ్‌రాజు, పరిశ్రమల శాఖ జీఎం

షెడ్యూల్ ప్రాంతాల పరిరక్షణకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న సచిన్

ఎదులాపురం: 5వ, 6వ షెడ్యూల్ ప్రాంతాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇందుకు వ్యతిరేకంగా షెడ్యూల్ ప్రాంత పరిరక్షణకు ఉద్యమించాలని టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించిన ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సమావేశాల్లో ఆయన తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొని మాట్లాడారు. నాన్ ఏజెన్సీలోని గ్రామాల ప్రజలు షెడ్యూల్ హక్కులకు దూరంగా ఉండటం, వారికి షెడ్యూల్ ప్రాంత ఫలాలు అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. దేశంలోని 5, 6 గిరిజన షెడ్యూల్ ప్రాంతాలను ఎత్తివేసి కార్పొరేట్ కంపెనీల ద్వారా ఆ ప్రాంత సహజ వనరులు దోపిడీ చేసేందుకు కుట్ర పన్నుతోందని పేర్కొన్నారు. ఇందుకు వ్యతిరేకంగా షెడ్యూల్ ప్రాంత పరిరక్షణకు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉంది.

'కుప్టి'కి నిధులు కేటాయించేలా చూస్తా

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



అనిల్‌జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గంలో ప్రాజెక్టులు, మారుమూల గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణాల కోసం ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తెలిపారు. నేటి నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్న కుప్టి ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం బడ్జెట్ కేటాయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని తెలిపారు. అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో నియోజకవర్గంలో పలు రోడ్ల పనులు మధ్యంతరంగా నిలిచి పనులు ముందుకు సాగడంలేదని పేర్కొన్నారు. దీంతోని యోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నియోజకవర్గలో నూతనంగా మరో 20 చెరువుల మంజూరు కోసం అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. సాగునీరు, రోడ్ల సౌకర్యాల ఏర్పాటు కోసం అసెంబ్లీలో ప్రస్తావించనున్నట్లు పేర్కొన్నారు.

వైద్యారోగ్యశాఖలో డిప్యూటేషన్ల రద్దు

- పూర్వస్థానాలకు 32మంది ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్యశాఖలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న 32మంది ఉద్యోగులు, సిబ్బంది డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసింది. ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, వర్క్ అడ్జస్ట్‌మెంట్, డిప్యూటేషన్, ఆన్ డ్యూటీపై ఉంటూ ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారందరినీ తమ పూర్వ స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. వేతనాలు స్థానికంగా తీసుకుంటూ మరో జిల్లాలో పని చేస్తుండటంతో జిల్లా వాసులకు సరైన వైద్యసేవలు అందడంలేదు.

అక్రమ డిప్యూటేషన్లు..

జిల్లా వైద్యారోగ్యశాఖతో పాటు రిమ్స్, బోథ్, నార్నూర్ ఏరియా ఆస్పత్రులు, ఉట్నూర్ జిల్లా ఆస్పత్రి, వివిధ పీహెచ్‌సీల్లో పనిచేయాల్సిన వైద్యులు, సిబ్బంది గత ప్రభుత్వంలోని రాజకీయ పెద్దలు, ఉన్నతాధికారుల అండతో పైరవీలు చేసి అక్రమంగా డిప్యూటేషన్లు పొందారనే ఆరోపణలున్నాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లాకు చెందిన 32 మంది వైద్యులు, సిబ్బంది ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీరంతా పూర్వస్థానాలకు రావాల్సి ఉంది. మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు వైద్యులు ఉట్నూర్ ఎస్‌ఎన్‌సీలో పనిచేస్తున్నారు. నిర్మల్ నుంచి ఒక వైద్యుడు ఉట్నూర్‌లో పనిచేస్తున్నారు. బోథ్ ఏరియా ఆస్పత్రిలో నలుగురు వైద్యుల డిప్యూటేషన్లు రద్దయ్యాయి. రిమ్స్‌లో పోస్టింగ్ కలిగి ఉన్న తొమ్మిదిమంది హెడ్ నర్సులు, నలుగురు ట్యూటర్లు, ఆరుగురు స్టాఫ్ నర్సులు, వైద్యారోగ్యశాఖలో పనిచేసే ఒక ఫార్మసిస్ట్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ఇద్దరు హెల్త్ ఎడ్యుకేటర్లు, ఒక పీఎంవోడీ డిప్యూటేషన్ రద్దయింది. వీరంతా గురువారం సాయంత్రం 5గంటల్లోపు తమ ఒరిజినల్ స్థానాల్లో విధుల్లో చేరాలని వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒక వేళ డిప్యూటేషన్ అవసరమని ఆయా విభాగాల హెచ్‌వోడీలు భావిస్తే కలెక్టర్ ద్వారా లిఖిత పూర్వకంగా నివేదిక ప్రభుత్వానికి పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వాలి'



గేట్ వద్ద అధికారులను అడ్డుకుంటున్న ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: తమ గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని మండలంలోని బీర్సాయిపేట పంచాయతీ పరిధి కొలాంగూడ ఆదివాసీలు డిమాండ్ చేశారు. బుధవారం బీర్సాయిపేటలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపటేల్ ఆత్రం తుకారాం మాట్లాడారు. వెంటనే త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించకుంటే ఐటీడీఏ, కలెక్టరేట్ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు గ్రామస్తులను సముదాయించే ప్రయత్నం చేయగా వారు ససేమిరా అన్నారు. కార్యాలయానికి ఉన్న కర్రలను అడ్డుగా పెట్టి అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎఫ్ఆర్వో గులాంమొయినొద్దీన్ కల్పించుకుని సముదాయించడంతో గ్రామస్తులు వెనుదిరిగారు. గ్రామస్తులు ముకుంద్రావు, భీంరావు, సోనేరావు, టేకం లక్ష్మణ్, అయ్యుబాయి, బాపురావు, వినాయక్‌రావు, ఆత్రం చిన్ను తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



విద్యార్థులతో డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాస్థాయి ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. బుధవారం డీఈవో కార్యాలయంలో డీఈవో ప్రణీత బహుమతులు అందజేశారు. కరంజి జెడ్పీఎస్‌ఎస్ (తెలుగు మీడియం)కు చెందిన రెడ్డికర్ అన్వితకు ప్రథమ, ఇచ్చోడ జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన శ్రీలతకు ద్వితీయ, కప్పర్ల జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన మనీషకు తృతీయ బహుమతి అందించారు. ఇంగ్లిష్ జెడ్పీఎస్‌ఎస్ ఇంద్రవెల్లికి చెందిన సాయిరాంకు మొదటి బహుమతి, బంగారుగూడ మోడల్ స్కూల్‌కు చెందిన శివశంకర్‌కు రెండో బహుమతి, ఇంద్రవెల్లి జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన వంశీకి మూడో బహుమతి ప్రదానం చేశారు. ప్రైవేట్ విభాగంలో జిల్లా కేంద్రంలోని చైతన్య స్కూల్‌కు చెందిన నాగప్రసేన్‌కు ప్రథమ, అదే పాఠశాలకు చెందిన రోహన్ భార్గవకు ద్వితీయ, లిటిల్‌ఫ్లవర్ పాఠశాలకు చెందిన శ్రీజకు మూడో బహుమతి అందించారు.

రైల్వేలైన్ సాధించే దాకా కొనసాగనున్న ఉద్యమం

ఆదిలాబాద్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధించే వరకూ ఉద్యమం కొనసాగుతుందని రైల్వేలైన్ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి నిమ్మల నరేందర్ పేర్కొన్నారు. కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా దీక్ష శిబిరంలో నరేందర్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని పేర్కొన్నారు. రైల్వేలైన్ నిర్మాణం పూర్తయితే జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. మెరుగైన రైల్వే వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాలు తమ పోరాటానికి మద్దతు పలుకుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. రైల్వేలైన్ సాధన కమిటీ సభ్యులు, తదితరులున్నారు.

సమ్మె విజయవంతం చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: కార్మిక హక్కుల సాధన, చట్టాల పునరుద్ధరణ కోసం ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు బుధవారం సంఘం ఆధ్వర్యంలో కమిషనర్ శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్‌ఎంఆర్, ఫిక్స్ డ్–పే కార్మికులను పర్మినెంట్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వమే ప్రతినెలా జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ పీఎఫ్, ఈఎస్‌ఐ ఎరియర్స్ బకాయిలను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ప్రమాదాల్లో కార్మికుడు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని, దహన సంస్కారాలకు రూ.30వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దర్శనాల నాగేశ్, నాయకులు ఎం.జనార్దన్, ఏ నారాయణ్‌రెడ్డి తదితరులున్నారు.

పాలిటెక్నిక్ లెక్చరర్‌కు పీహెచ్‌డీ పట్టా



నర్సయ్యను సన్మానిస్తున్న యాజమాన్యం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో హ్యూమనిటీస్ అండ్ సైన్సెస్ విభాగంలో ఆంగ్ల లెక్చరర్‌గా పనిచేస్తున్న చింతకుంట్ల నర్సయ్య పీహెచ్‌డీ పట్టా సాధించారు. 'భారతీయ జీవితానికి సంబంధించిన పౌరాణిక వివరణలు' అనే అంశంపై హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పరిశోధన చేశారు. హైదరాబాద్ ఆంగ్ల విభాగ ప్రొఫెసర్ దామోదర్ పర్యవేక్షణలో మూడేళ్లుగా పరిశోధన చేసి గ్రంథాన్ని అందించారు. దీంతో యూనివర్సిటీ ఈయనకు ఇటీవల పట్టా అందించింది. బుధవారం కళాశాలలో నర్సయ్యను సన్మానించారు. ప్రిన్సిపాల్ భరద్వాజ, ఆయా విభాగాల హెచ్‌వోడీలు రాజ్‌కుమార్, వీరస్వామి, రాజన్న, సునీల్, సుజయ్ తదితరులు పాల్గొన్నారు.



క్యూలో పత్తి వాహనాలు

బేల మండల కేంద్రంలోని జిన్నింగ్ ఫ్యాక్టరీ ఎదుట బుధవారం పత్తి వాహనాలు బారులు తీరాయి. సీసీఐ పత్తి కొనుగోలు చేస్తున్నా ఒకే కాంటా ఉన్న కారణంగా తూకంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో రైతులు ఒక్కరోజు ముందే పత్తి వాహనాలతో జిన్నింగ్ కేంద్రానికి చేరుకుని గంటల తరబడి నిరీక్షిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

'28 కులాలను ఓబీసీలో చేర్చాలి'



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసా: 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ బుధవారం బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజును కోరారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ఢిల్లీలో ఆయనను వినతిపత్రం అందజేశారు. ఆరె మరాఠా, బుక్క అయ్యవార్లు, గౌడజట్టి, కుల్లకడిగితో పాటు మొత్తం 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరారు. ఓబీసీలో చేర్చకపోవడంతో 28 కులాలకు చెందిన విద్యార్థులు విద్య, ఉద్యోగపరంగా నష్టపోతున్నారన్నారు.

పశువులు తరలిస్తున్న లారీ పట్టివేత



లారీలో తరలిస్తున్న పశువులు

నేరడిగొండ: పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు ఓ లారీలో అక్రమంగా పశువులు తరలిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో కలిసి కుప్టి ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ఓ డ్రైవర్ లారీని ఆపి పరారైనట్లు తెలిపారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో పశువులు ఉన్నట్లు పేర్కొన్నారు. వాటిని గోశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

నాగోబా స్మరణలో 'మెస్రం'

- మర్రిచెట్టు వద్ద కొనసాగుతున్న పూజలు
- దేవుడు, వంశ చరిత్రను బోధిస్తున్న పెద్దలు
- కితల వారీగా సామూహిక వంటలు

ఇంద్రవెల్లి: నాగోబా స్మరణలో మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 9న నిర్వహించే నాగోబా మహాపూజకు అవసరమయ్యే గంగాజలంతో వచ్చిన మెస్రం వంశీయులు కేస్లాపూర్ గ్రామ పొలిమేరలో పడియోర్ జన్మస్థలమైన మర్రిచెట్టు వద్ద బస చేశారు. ఉమ్మడి జిల్లా, మహారాష్ట్ర నుంచి మెస్రం వంశీయులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రాత్రి ప్రదాన్ కితకు చెందిన మెస్రం పెద్దల ఆధ్వర్యంలో కిక్రి వాయిస్తూ నాగోబా చరిత్ర, 22 కితల మెస్రం వంశీయుల చరిత్రను బోధిస్తున్నారు. బుధవారం 22 కితల వారీగా జొన్నగట్కతో సంప్రదాయ వంటలు చేసి నైవేద్యం సమర్పించారు. జొన్నగట్కను ఉండలు చేసి కితలవారీగా పంపిణీ చేశారు. రాత్రి మెస్రం వంశంలోని 22 కితాల్లో మరణించిన పెద్దల పేరుతో తూమ్ (కర్మకాండ) పూజలు చేశారు. 9న జాతర ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.



తూమ్ పూజలకు నైవేద్యం తయారు చేసేందుకు బియ్యం సేకరిస్తున్న మెస్రం వంశీయులు

తూమ్ పూజలు (కర్మకాండ)

మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు బుధవారం రాత్రి తూమ్ పూజ (కర్మకాండ) ఘనంగా నిర్వహించారు. 22 కితల మెస్రం వంశీయుల్లో మరణించిన పెద్దల పేర్లతో తూమ్ (కర్మకాండ)పూజలు చేశారు. తూమ్ పూజలతో వారు నాగోబా సన్నిధికి చేరినట్లు భావిస్తారు.



కష్టసుఖాలు తెలుసుకుంటున్న మెస్రం మహిళలు



వంటలు చేస్తున్న మెస్రం వంశ మహిళలు



ఎడ్లబండిపై వస్తున్న మెస్రం వంశీయులు

జొన్నగట్క ప్రత్యేకత



జొన్నగట్కతో తయారు చేస్తున్న ఉండలు

మెస్రం వంశీయుల సంప్రదాయ వంట జొన్నగట్కకు ప్రత్యేకత ఉంది. బియ్యం పాముగంగులో ఉండడం, పప్పు ధాన్యాలు పాము కళ్ల ఆకారంలో పోల్చి నాగోబా పూజల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఇండ్ల నుండి తీసుకొచ్చిన జొన్నగట్క, పిండి పదార్థాలతో తయారుచేసిన చారు (కూర)ను కితల వారీగా వండి భోజనాలు చేస్తారు.

నాగోబా ఆలయానికి చేరిన కుండలు



ఆలయ ఆవరణలో కుండలు

నాగోబా మహాపూజ, సంప్రదాయ పూజలకు అవసరమయ్యే సిరికొండ మండల కేంద్రంలోని గుగ్గిల స్వామి తయారు చేసిన ఏడు రకాల 350 మట్టి కుండలు, మట్టి పాత్రలు బుధవారం నాగోబా ఆలయానికి చేరాయి. 20 పెద్ద బాణాలు, 55 కుండలు, 55 మూతలు, 45 కడుముంతలు, 150 దీపాంతలను నాగోబా ఆలయంలో భద్రపరిచారు.

పాలకుల నిర్లక్ష్యంతో కలగానే రైల్వేలైన్



మాట్లాడుతున్న దుర్గం నూతన్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ నిర్మాణం కలగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడల్లా ఆదిలాబాద్, నిర్మల్ ప్రజానీకం బడ్జెట్‌లో నిధులు కేటాయించి రైల్వే నిర్మాణాన్ని పూర్తి చేస్తారేమోనని ఎదురుచూస్తున్నారన్నారు. రైల్వే లైన్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ ఫిబ్రవరి 19న నిర్మల్ కలెక్టరేట్ ఎదుట వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.రామలక్ష్మణ్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, నిర్మల్ డివిజన్ కార్యదర్శి బొమ్మెన సురేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డాకూర్ తిరుపతి, సీపీఎం నిర్మల్ మండల నాయకులు అతిక్, చందుల సాయి కిరణ్, బరుకుంట గంగారం, ఎస్ఎఫ్ఐ నాయకులు దిగంబర్, నవీన్, ఐఎఫ్‌టీయూ నాయకులు డి.గంగాధర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి



సుశ్వత్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై జ్యోతిమణి తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని ఓ అపార్టుమెంటులో అద్దెకు ఉంటున్న డాక్టర్ సిద్ధార్థ్, భవాని ప్రసన్న దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సుశ్వత్ (18) స్థానిక దీక్ష జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి ప్రస్తుతం ఆదిలాబాద్‌లో ఆప్తాల్మజిస్ట్‌గా, తల్లి లక్ష్మణచాంద మండలం వెల్మల్- బొప్పారం యూనియన్ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సుశ్వత్ బుధవారం బైక్‌పై వెళ్తుండగా రాజరాజేశ్వర గార్డెన్ సమీపంలో మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో ప్రభుత్వ బోధనాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నిఖిల్ మృతదేహం

లక్ష్మణచాంద(నిర్మల్): మండల కేంద్రానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన సిరిపురం ఆనంద్ దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు నిఖిల్ (20) ఇటీవల కోచింగ్ కోసమని హైదరాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం రాత్రి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

నందిపేట్: నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని సీహెచ్ కొండూరు సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో గాయాలపాలైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ముధోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన దూసమూడి రుక్మవ్వ (42) భర్త సాయన్న, కుమారుడు హర్షవర్ధన్‌తో కలిసి బతుకుదెరువు కోసం ఏడేళ్ల క్రితం ఆర్మూర్‌కు వలస వచ్చారు. ఈ నెల 1న భర్తతో కలిసి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా కొండూరు సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో రుక్మవ్వకు తీవ్ర గాయాలుకావడంతో స్థానికులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన లస్మారెడ్డి

భైంసారూరల్: భైంసా పట్టణ సమీపంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని మాటేగాం గ్రామానికి చెందిన లస్మారెడ్డి భైంసా నుంచి మాటేగాంకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ట్రిపుల్‌ఐటీ గాడిన పడేనా..?

- దృష్టి సారిస్తున్న ప్రజాప్రతినిధులు
- విద్యార్థుల్లో పెరుగుతున్న ధైర్యం



బాసర ట్రిపుల్‌ఐటీ



బాసర ట్రిపుల్‌ఐటీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్ (ఫైల్)

భైంసా(ముధోల్): బాసర ట్రిపుల్‌ఐటీలో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తున్నారు. సోమవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ట్రిపుల్‌ఐటీకి వెళ్లి పరిశీలించారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అధైర్యపడవద్దని.. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఉండే వసతిగృహాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

పెరుగుతున్న ధైర్యం...

ట్రిపుల్‌ఐటీలో కొన్నేళ్లుగా పాతుకుపోయిన కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మెస్‌లలో పురుగుల అన్నం పెట్టే పరిస్థితిని మార్చాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు పెడుతున్న ఆంక్షలు గోప్యత కారణంగా ఏం జరుగుతుందో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ట్రిపుల్‌ఐటీలో జరుగుతున్న అక్రమాలపై అవసరమైతే విజిలెన్స్‌తో విచారణ చేయిస్తానని ఎమ్మెల్యే రామారావుపటేల్ హామీ ఇచ్చారు. విద్య, వైద్యంపై తాను రాజీపడనన్నారు. ఎమ్మెల్యే పర్యటనతో ట్రిపుల్‌ఐటీ మెస్‌ల నిర్వాహణపైన క్యాంపస్ అధికారులు దృష్టి సారించారు.

16 ఏళ్లుగా నిరీక్షణ...

ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి 2008లో బాసర, ఇడుపులపాయ, నూజివీడులలో ట్రిపుల్‌ఐటీలను ప్రారంభించారు. రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రానికి బాసర ట్రిపుల్‌ఐటీ ఒక్కటే మిగిలింది. ట్రిపుల్‌ఐటీ ప్రారంభంలో 129 మంది కాంట్రాక్టు అధ్యాపకులు, 19 మంది పర్మినెంట్ ప్రొఫెసర్లను ప్రభుత్వం నియమించింది. 16 ఏళ్లుగా వారే పనిచేస్తున్నారు. మరో 70 మంది అధ్యాపకులను గెస్ట్ ఫ్యాకల్టీగా తాత్కాలికంగా నియమించుకున్నారు. మరో 125 మంది ప్రొఫెసర్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం 2014లో సూచించింది. ఇప్పటికీ ఈ పోస్టుల భర్తీ జరుగలేదు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. కానీ యూనివర్సిటీ ఏర్పడినప్పటి నుంచి పనిచేస్తున్న ట్రిపుల్‌ఐటీ కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నోచుకోవడంలేదు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో ప్రత్యామ్నాయ అవకాశాలు వస్తే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లి పోతున్నారు. 19 మంది పర్మినెంట్ ప్రొఫెసర్లు ఉంటే ఉన్నత చదువుల పేరిట 12 మంది సెలవులో వెళ్లారు. తాత్కాలిక అధ్యాపకులను నియమించుకుని విద్యాసంవత్సరం వెళ్లదీస్తున్నారు. ఒక వైపు విద్యాబోధన మరోవైపు అదనపు బాధ్యతలతో తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నారు. ఎక్కడ లోపం జరిగినా క్రమశిక్షణ చర్యలకు బాధ్యులవుతామనే భయం ఉద్యోగులను వెంటాడుతోంది. డీన్‌లు, హెడ్ ఆఫ్‌ద డిపార్ట్‌మెంట్, ఎగ్జామినర్, చీఫ్ వార్డెన్, వార్డెన్, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ వంటి కీలకమైన బాధ్యతలను అధ్యాపకులకు అప్పజెప్తున్నారు. ట్రిపుల్‌ఐటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. క్రమబద్ధీకరణతోపాటు నిబంధనల ప్రకారం వేతనాల పెంపు, ఇతర భత్యాల కోసం ఈ ఉద్యోగులంతా మూడు నెలలకోసారి పోరాటం చేస్తున్నారు.

వసతులు అంతంతే...

ట్రిపుల్‌ఐటీలో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మరుగుదొడ్ల నిర్వాహణ సరిగాలేదు.నిబంధనల పేరిట అధికారులు ఎవరినీ అనుమతించడంలేదు. క్యాంపస్‌లో ఏంజరిగినా బయటకు పొక్కనివ్వడంలేదు. మెస్‌లలో పురుగుల అన్నం వచ్చినా విద్యార్థులు అలాగే భోజనాలు చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందికి తోడు కొంత మంది రిటైర్డ్ ఆర్మీ అధికారులను నియమించుకుని పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. విద్యార్థులు తరగతి గదిలో లేదంటే భోజన శాలకు అక్కడి నుంచి నేరుగా హాస్టల్ గదుల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. నలుగురు కలిసి మాట్లాడినా విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల ఫోన్లు తీసుకుని తనిఖీలు కూడా చేస్తున్నారు. చిన్న చిన్న తప్పిదాలకు సంజాయిషి లెటర్లు రాయించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండు, మూడేళ్లుగా ట్రిపుల్‌ఐటీ సమస్యలపై ఆందోళనలు చేసిన విద్యార్థులపై సైతం నిఘా ఉంచినట్లు సమాచారం.

సమస్యలు నా దృష్టికి తీసుకురండి

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా నన్ను సంప్రదించవచ్చు. విద్యార్థుల ఇబ్బందులు ధైర్యంగా తెలియజేయవచ్చు. విద్య, వైద్యం విషయంలో రాజీపడలేం. ట్రిపుల్‌ఐటీలో అక్రమాలపై అవసరమైతే విజిలెన్స్ విచారణ చేయిస్తాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే మా లక్ష్యం.

– రామారావుపటేల్, ఎమ్మెల్యే, ముధోల్

బడి పిల్లలకు భద్రతేది?



ఆటో డ్రైవర్ సీటు పక్కన ప్రమాదకరంగా కూర్చున్న ఇద్దరు విద్యార్థులు



ప్రమాదకరంగా ఆటోలో కూర్చుని వెళుతున్న విద్యార్థులు

బడి పిల్లలకు భద్రత లేకుండా పోయింది. పరిమితికి మించి ప్రైవేటు బస్సులు, ఆటోల్లో విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఆటో డ్రైవర్ సీటు పక్కన రెండు వైపులా ఇద్దరేసి విద్యార్థులను కూర్చోబెట్టుకొని బడికి తీసుకెళ్తున్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, ప్రైవేటు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. ప్రమాదం జరిగినప్పుడు హడావిడి చేసే అధికారులు ఆ తర్వాత మిన్నకుండి పోతున్నారు. జిల్లా కేంద్రంలో ముఖ్యంగా విద్యార్థులను తరలించే ఆటోలు, ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి తీసుకెళ్తున్నా రవాణా శాఖ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



శివాజీ చౌరస్తాలో పరిమితికి మించి బడి పిల్లలను కూర్చోబెట్టుకొని వెళ్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు